సాక్షి విజయనగరం

గురువారం । 30 । మార్చి । 2023



అభాగ్యులపై 'వాత్సల్యం'

విధి వంచితులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఎటువంటి ఆదరణ లేక అభాగ్యులుగా మిగిలిన పిల్లలపై 'వాత్సల్యం' చూపుతోంది. చదువులు చెప్పిస్తోంది. -10లో



అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

తోటపాలెంలోని సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న సేనాపతి పల్లవి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాణించింది. 64 కిలోల విభాగంలో పతకాల పంట పండించింది. -10లో



షాక్‌తో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

మండలంలోని బెల్లాం గ్రామంలో విద్యుత్ షాక్‌తో కాంట్రాక్టు కార్మికుడు కర్రి అప్పలనాయుడు(36) మృతి చెందినట్టు ఎస్సై మహేష్ తెలిపారు. -10లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురు (సా॥)	శుక్ర (ఉ॥)
6:15	4:32

న్యూస్‌రీల్

దండుమారమ్మకు పూజలు



దండుమారమ్మతల్లిని దర్శించుకుంటున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి

విజయనగరం: నగరంలోని ఖాళీఘాట్ కాలనీలో వెలసిన దేవి దండుమారమ్మ తల్లిని మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి బుధవారం దర్శించుకున్నారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. దండుమారమ్మ ఆశీస్సులు నగర ప్రజలందరిపైనా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శేషాద్రినాయుడు, హెచ్‌సీలు రమణ, రాంబాబుతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమి శుభాకాంక్షలు



కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రజలకు, వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరామచంద్రమూర్తి ఆదర్శ జీవితం, రామతత్వాన్ని ప్రతి ఒక్కరూ మననం చేసుకోవాలని గుర్తు చేశారు.

అందరికీ శ్రీరాముని ఆశీస్సులు



మజ్జి శ్రీనివాసరావు

సుగుణాభి రాముడు ఆశీస్సులు శ్రీరామ నవమి పర్వదినాన ప్రజలందరిపై ఉండాలని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

పట్టువస్త్రాల సమర్పణ



అర్చకులకు పట్టు వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తనయుడు మణిదీప్

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలో శ్రీరామనవమి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని సీతారామస్వామి వారికి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తనయుడు బడ్డుకొండ మణిదీప్‌నాయుడు బుధవారం పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను అర్చకులకు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పైడితల్లి హుండీల ఆదాయం లెక్కింపు



హుండీల ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈఓ

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి ఆలయ హుండీల ఆదాయాన్ని అమ్మవారి కల్యాణమండపంలో బుధవారం లెక్కించారు. 54 రోజులకుగాను అమ్మవారి చదురుగుడి హుండీల నుంచి రూ.21,93,558లు, ఐదు అమెరికన్ డాలర్లు, 32 గ్రాముల 100 మిల్లీగ్రాముల బంగారం, 441 గ్రాముల వెండి లభించాయని ఆలయ కార్యనిర్వహణాధికారి, జిల్లా సహాయ కమిషనర్ కె.ఎల్.సుధారాణి తెలిపారు. వనంగుడి హుండీల నుంచి రూ.4,86,113లు, నాలుగు గ్రాముల 200 మిల్లీ గ్రాముల బంగారం, 111 గ్రాముల వెండి లభించిందన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి, ట్రస్టు బోర్డు ప్రతినిధులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అతివలకు ఆసరా

నాడు: డ్వాక్రా మహిళలకు బ్యాంకుల్లో ఉన్న రుణాలను పూర్తిగా మాఫీ చేస్తానని 2014 సార్వత్రిక ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు... అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అటకెక్కించారు. తర్వాత పది వేల రూపాయల చొప్పున ఇస్తానని చెప్పినా అవీ పూర్తిగా ఇవ్వకుండా దగా చేసిన చంద్రబాబు ప్రభుత్వాన్ని ఈ రోజుకూ మహిళలు మరచిపోలేదు. సందర్భం వచ్చినప్పుడల్లా చంద్రబాబు మోసం చేసిన తీరును గుర్తుచేసుకుంటున్నారు.

నేడు 2019 ఏప్రిల్ 11 నాటికి డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను పూర్తిగా చెల్లిస్తామని జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చారు. నాలుగు విడతల్లో చెల్లిస్తామని చెప్పారు. అన్నమాట ప్రకారం ఇప్పటివరకు మూడు విడతల మాఫీ సొమ్మును వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అక్కచెల్లెమ్మలకు అందజేసింది. అధిక వడ్డీకి ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుల నుంచి అప్పులు తెచ్చుకునే అవసరం తప్పింది. వారి ఆర్థిక పరిపుష్టికి 'వైఎస్సార్ ఆసరా' పథకం భరోసా ఇస్తోంది.

- ఆర్థిక పరిపుష్టికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సహకారం
- నాడు డ్వాక్రా రుణాల మాఫీ హామీని అటకెక్కించిన టీడీపీ ప్రభుత్వం
- డ్వాక్రా మహిళలకు చంద్రబాబు దగా
- నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని జగన్‌మోహన్‌రెడ్డి హామీ
- ఇప్పటికి మూడు విడతల సొమ్ము జమ
- విజయనగరం జిల్లాలోని మహిళలకు రూ.754.12 కోట్ల లబ్ధి
- పార్వతీపురం మన్యం జిల్లాలో రూ.281.66 కోట్ల లబ్ధి
- ఊరూరా ఆసరా సంబరాలు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేస్తున్న పలు పథకాల్లో 'వైఎస్సార్ ఆసరా' ఒకటి. 2019 ఏప్రిల్ 11 నాటికి డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలకు వివిధ బ్యాంకుల్లో ఉన్న రుణం మొత్తాన్ని విడతల వారీగా ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఈ మేరకు విజయనగరం జిల్లాలో ఈ పథకానికి అర్హత ఉన్న 36,675 సంఘాల్లోని 3,92,709 మంది మహిళలకు లబ్ధి కలుగుతోంది. వారికున్న రూ.1,006.43 కోట్ల రుణాలను నాలుగేళ్లలో నేరుగా నగదు రూపంలో అందజేయడం ద్వారా వారి ఆర్థికాభివృద్ధికి దోహదం చేయాలనేది ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అభిమతం. ఇంతవరకు మూడు విడతల్లో ఆర్థిక సంవత్సరాల వారీగా ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం రూ.754.12 కోట్లు రుణమాఫీ జమ అయింది. ఇటీవల మూడో విడతలో 36,463 సంఘాల్లోని మహిళలకు రూ.251 కోట్లు సొమ్ము అందింది. తొలివిడత 2020 నవంబర్ 9న 36,434 మహిళా సంఘాలకు చెందిన సభ్యులకు రూ.250.54 కోట్లు సొమ్ము వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. రెండో విడత 36,475 పొదుపు సంఘాల సభ్యులకు రూ.252.28 కోట్ల మేర ప్రయోజనం చేకూరింది. గత ఏడాది అక్టోబరు 7వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆయా మహిళల ఖాతాల్లో బటన్ నొక్కి సొమ్మును జమ చేశారు. ఇప్పుడు మూడో విడతగా 36,463 సంఘాలకు రూ.251.30 కోట్లు విడుదల చేశారు.

'ఆసరా'తో ప్రయోజనం ఇలా...

	తొలి విడత		రెండో విడత		మూడో విడత	
నియోజకవర్గం	సంఘాల సంఖ్య	రుణ మాఫీ సొమ్ము (రూ.కోట్లలో)	సంఘాల సంఖ్య	రుణ మాఫీ సొమ్ము (రూ.కోట్లలో)	సంఘాల సంఖ్య	రుణ మాఫీ సొమ్ము (రూ.కోట్లలో)
బొబ్బిలి	5,389	29.29	5,388	29.41	5,382	29.31
చీపురుపల్లి	5,050	38.60	5,051	38.64	5,048	38.61
గజపతినగరం	5,911	38.68	5,914	38.72	5,914	38.68
నెల్లిమర్ల	5,308	40.85	5,308	41.00	5,308	40.91
రాజాం	5,135	38.92	5,168	39.41	5,168	39.14
సాలూరు (మెంటాడ మండలం)	785	3.76	788	3.78	786	3.77
ఎస్.కోట	4,681	30.83	4,683	30.83	4,683	30.83
విజయనగరం	4,175	29.61	4,175	30.50	4,175	30.04
కురుపాం	4,062	20.70	4,127	21.02	4,127	21.02
పాలకొండ	4,480	29.85	4,506	30.11	4,506	30.07
పార్వతీపురం	4,415	26.04	4,428	26.49	4,428	26.45
సాలూరు	3,577	16.57	3,583	16.70	3,585	16.64



గజపతినగరంలో బుధవారం నిర్వహించిన ఆసరా సంబరాల్లో పాల్గొన్న లబ్ధిదారులు



బాడంగిలో వైఎస్సార్ ఆసరా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జిశ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



డెంకాడ మండలంలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

పార్వతీపురం మన్యం జిల్లాలో...

వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో మూడు విడతల్లో 16,446 మహిళా సంఘాల్లోని సభ్యులకు రూ.281.66 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ అయ్యాయి. మొదటి విడతలో 16,534 సంఘాలకు రూ. 93.52 కోట్లు, రెండో విడతలో 16,446 సంఘాలకు రూ.94.07 కోట్ల మేర లబ్ధి చేకూరింది. మరో విడత అందిస్తే మొత్తం వారి రుణాల మాఫీ హామీ నెరవేరుతుంది.

ఊరూరా ఆసరా సంబరాలు

డ్వాక్రా సంఘాలకు పెద్దమొత్తంలో ప్రభుత్వం లబ్ధి కల్పించడం, మహిళా సంక్షేమానికి కృషిచేస్తుండడంతో అతివలు సంబరాలు చేసుకుంటున్నారు. ఆర్థికంగా ఎదుగుతున్నామంటూ ఆనందం వ్యక్తంచేస్తున్నారు. వైఎస్సార్ ఆసరా వేడుకలను ఊరూరా జరుపుకుంటున్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పూల, క్షీరాభిషేకాలు చేస్తున్నారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు మనసారా కృతజ్ఞతలు చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో సంక్షేమ పాలనకు మద్దతిస్తామని బహిరంగంగానే ప్రకటిస్తున్నారు.

పకడ్బందీగా పదోతరగతి పరీక్షలు

విజయనగరం అర్బన్: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సూచించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌తో కలిసి కలెక్టర్లతో మంత్రి బొత్స వీడియో కాన్ఫెరెన్స్‌లో బుధవారం మాట్లాడారు. విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని సూచించారు. అనంతరం జిల్లాలో పరీక్షల నిర్వహణపై కలెక్టర్ సూర్యకుమారి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని 27 మండలాల్లో 127 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. వీటికి 24,099 మంది రెగ్యులర్, 1,428 ప్రైవేటు అభ్యర్థులు కలిపి 25,577 మంది హాజరవుతారని వెల్లడించారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్లు, ఎంపీడీఓలు తనిఖీచేసి ప్రతిరోజు కలెక్టర్లకు నివేదికలు అందజేయాలన్నారు. ప్రతికేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉండాలన్నారు. తహసీల్దార్ల ఆధ్వర్యంలో 9 ఫ్లయింగ్ స్క్వాడ్‌బృందాలు పరీక్షలను పర్యవేక్షిస్తాయని చెప్పారు. ప్రశ్నపత్రాల కస్టోడియన్‌గా జిల్లా రెవెన్యూ అధికారి వ్యవహరిస్తారని తెలిపారు. స్పాట్ వాల్యూయేషన్ పూర్తయ్యేవరకు స్ట్రాంగ్‌రూమ్ అయిన కోటలోని హైస్కూల్ వద్ద పోలీస్ బందోబస్తు ఉండాలన్నారు. సందేహాలకు, సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్-9494326124 ఏర్పాటు చేశామని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, డీఈఓ లింగేశ్వరరెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ రమణకుమారి, డీఎస్పీ శేషాద్రి, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీకుమారి, ఆర్టీసీ అధికారి కె.శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో పరీక్షల నిర్వహణపై సూచనలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

ఆస్తిపన్ను వసూలులో నెల్లిమర్ల ఫస్ట్

- 96 శాతంతో రీజియన్లోనే ప్రథమ స్థానం

నెల్లిమర్ల: ఆస్తిపన్ను వసూళ్లలో నెల్లిమర్ల నగర పంచాయతీ విశాఖపట్నం రీజియన్‌లోనే ప్రథమ స్థానంలో నిలిచింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి మరోరోజు మిగిలి ఉండగా 96 శాతంతో ముందంజలో ఉంది. పట్టణ పరిధిలోని రెండు వార్డు సచివాలయాల పరిధిలో శతశాతం పన్నులు వసూలయ్యాయి. నగర పంచాయతీలో 20 వార్డులు, 8 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇక్కడున్న 5,286 అసెస్‌మెంట్స్‌కు సంబంధించి రూ.1.22 కోట్ల ఆస్థి పన్ను వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు రూ.1.12 కోట్లు (96 శాతం)వసూలు చేశారు. 6, 7 వార్డు సచివాలయాలు శతశాతం పన్నులు వసూలు చేయగా, 3, 4, 8 సచివాలయాలు 90 శాతం దాటి లక్ష్యాన్ని సాధించాయి. 993 అసెస్‌మెంట్స్‌కు సంబంధించి పన్నువివాదం న్యాయస్థానం పరిధిలో ఉంది. ప్రభుత్వ, న్యాయస్థానం పరిధిలో ఉన్న భవనాలకు సంబంధించిన పన్నుల మొత్తం వడ్డీతో కలిపి సుమారు రూ 6.5 కోట్లు ఉంది. అది కూడా వసూలైతే నగరపంచాయతీ అభివృద్ధి పథంలో పయనిస్తుందని నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ తెలిపారు. పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.



నెల్లిమర్ల నగరపంచాయతీ కార్యాలయం

మరచిపోలేని రోజు



గౌరినాయుడును పురస్కారంతో సత్కరిస్తున్న పతంజలి సాంస్కృతిక వేదిక ప్రతినిధులు

- పతంజలి పురస్కార గ్రహీత గంటేడ గౌరునాయుడు

విజయనగరం పూల్‌బాగ్: ప్రపంచం గర్వించదగ్గ రచయిత, పాత్రికేయుడు, సినీ మాటల రచయిత స్వర్గీయ కె.ఎన్.వై.పతంజలి పేరున ఏటా కె.ఎన్.వై.పతంజలి సాంస్కృతిక వేదిక అందించే పురస్కారాన్ని అందుకోవడం సంతోషంగా ఉందని, ఇది మరచిపోలేని రోజు అని రచయిత, కవి, గంటేడ గౌరునాయుడు అన్నారు. పతంజలి జయంతి సందర్భంగా వేదిక ప్రతినిధులు స్థానిక కంటోన్మెంట్ గురజాడ పబ్లిక్ స్కూల్లో బుధవారం ఏర్పాటు చేసిన పురస్కార ప్రదానం సభలో ముందుగా పతంజలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గౌరునాయుడు మాట్లాడుతూ పతంజలి రచనలకు విజయనగరం జిల్లా కేంద్ర బిందువుగా ఉండేదన్నారు. తన రచనా ప్రవాహం, మాటల తూటాలతో వ్యవస్థలో కుళ్లను కడిగే ప్రయత్నం చేశారన్నారు. తెలుగు సాహిత్య చరిత్రలో ప్రతి రచయితకు విమర్శకులు ఉండేవారని, ఒక్క పతంజలికి మాత్రమే గొప్ప స్నేహితులు ఉండేవారన్నారు. రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ గురజాడ గిరీశం పాత్రను సృష్టిస్తే పతంజలి గోపాత్రుడ్ని సృష్టించి విభిన్న తరహాలో ప్రజలముందుకి తెచ్చారన్నారు. ప్రజల భాష, గుండె ఘోష తెలిసిన రచయిత కాబట్టే అందరి మన్ననలు పొందారన్నారు. వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అధ్యక్షతన జరిగిన సభలో పతంజలి సతీమణి ప్రమీలా, అల్లుడు రామకృష్ణ రాజు, డాక్టర్ మోహన్, వేదిక కార్యదర్శి ఎస్.కె. బాబు, వి.ఎమ్. కె.లక్ష్మణరావు, సీనియర్ పాత్రికేయుడు ఎలిశెట్టి సురేష్, హోటల్ మయూరి అధినేత బాబూరావు, చీకటి దివాకర్, కందాల సాయిబాబా, గురజాడ ఇందిరా, చీకటి చంద్రిక, కాంచన, దవడ కొండబాబు, కొతంశెట్టి శ్రీనివాసరావు, గిడుతూరి పైడితల్లి, ఇప్పలవలస గోపి, రామచంద్ర రాజు, గాయకుడు డప్పుశ్రీను, జక్కు రామకృష్ణ, స్కూల్‌హెచ్‌ఎం శేఖర్ పాల్గొన్నారు.

శ్రీరామనవమి సుఖసంతోషాలు నింపాలి



విజయనగరం అర్బన్: ధర్మబద్ధమైన జీవనానికి నిలువెత్తు నిర్వచనం శ్రీరామచంద్రుడు. ఆయన పితృవాక్కు పరిపాలకుడు. ఎన్నికష్టాలు ఎదురైనా ధర్మం తప్పని మహనీయుడు. ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపిన పురుషోత్తముడు. ఈ పవిత్ర దినాన సీతారాముల కల్యాణం చూసి తరించిన వారి జన్మసార్థకం. శ్రీరామ నవమి ప్రతీఒక్కరి ఇంటా సుఖసంతోషాలను నింపాలని శ్రీరామచంద్రుడి కృపాకటాక్షాలు మీపై ఉండాలని కోరుకుంటూ.. జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ ఎ.సూర్యకుమారి శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు.

రీసర్వేలో జిల్లా ముందంజ

- కేఆర్‌సీ ఎస్డీసీ సూర్యనారాయణ



బొబ్బిలి రూరల్:

భూముల రీ సర్వేలో రాష్ట్రంలో విజయనగరం జిల్లా ముందంజలో ఉందని, అధిక గ్రామాల్లో సర్వేచేపట్టిన జిల్లాల్లో రెండో స్థానంలో ఉన్నట్టు కేఆర్‌సీ ఎస్డీసీ సూర్యనారాయణ తెలిపారు. బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయంలో సమగ్ర భూరీసర్వే, భూముల వివరాల నమోదు రికార్డులు పరిశీలించారు. సిబ్బంది నుంచి సర్వే తీరును తెలుసుకున్నారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 983 గ్రామాలకు గాను తొలివిడతలో 179 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందన్నారు. రెండో విడతలో 311 గ్రామాల్లో రీసర్వే జరుగుతోందని తెలిపారు. ఏప్రిల్ నెలాఖరులోగా రెండో విడత భూముల రీ సర్వే పూర్తవుతుందని, తరువాత మరో మూడునెలల్లో జిల్లా వ్యాప్తంగా సర్వే పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న రీత్యా సమగ్ర భూరీసర్వే భావితరాలకు మేలు చేస్తుందన్నారు. సర్వేరాళ్లు ఇప్పటికే మెంటాడ, బొబ్బిలి, బాడంగి మండలాలకు వచ్చాయన్నారు.

రామతీర్థంలో కల్యాణశోభ

- నేడే సీతారాముల కల్యాణోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

నెల్లిమర్ల రూరల్: శ్రీరామనవమి వేడుకలకు రామతీర్థం సీతారామస్వామివారి దేవస్థానం ముస్తాబైంది. స్వామివారి కల్యాణాన్ని రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో వైభవంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నంలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించేందుకు కల్యాణ మండపాన్ని సుందరంగా అలంకరించారు. తలంబ్రాల కార్యక్రమానికి మంచి ముత్యాలతో పాటు గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను సిద్ధంచేశారు. సుమారు 25వేల మంది భక్తులు కూర్చొని కల్యాణాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ, చిన్నపిల్లలకు పాలు తదితర సౌకర్యాలను ఆలయ అధికారులు కల్పించారు. ఎండ తీవ్రత నేపథ్యంలో వీఐపీలు, భక్తులకు ఎయిర్ కూలర్లను ఏర్పాటు చేశారు. సింహాచలం దేవస్థానం నుంచి తెచ్చిన పట్టు వస్త్రాలు, తలంబ్రాలను రాష్ట్ర ప్రభుత్వం తరపున విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ దంపతులు సమర్పించనున్నారు.



సీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులు

నేటి పూజా కార్యక్రమాలు ఇలా...

ఉదయం 3 గంటలకు స్వామివారికి ఆరాధన, బాలభోగం, తీర్థగోష్ఠిని నిర్వహిస్తారు. 6 గంటలకు యాగశాలలో పూర్ణాహుతి, 6.30 గంటలకు శ్రీరామచంద్ర ప్రభువు అవతారసర్గ విన్నపం, 7 గంటలకు తేనె, నెయ్యి, ఫలరసాలు, సముద్ర నదీ జలాలతో అష్టకలశ స్నపన మహోత్సవం (అభిషేకం) కార్యక్రమాలను అర్చకులు జరిపిస్తారు. 10.30 గంటల నుంచి స్వామివారి కల్యాణోత్సవం ప్రారంభమవుతుంది. ప్రత్యేకపూజలు అనంతరం సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను దేవాలయం నుంచి కల్యాణ మండపం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చి విశేష అభిషేకాలు జరిపించి స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపిస్తామని దేవస్థాన అర్చకులు తెలిపారు.



సిద్ధమైన కల్యాణ వేదిక



మండపేట బొండాలు, గోటి తలంబ్రాలను సమర్పిస్తున్న సేవా సంఘం ప్రతినిధులు

రాములోరి కల్యాణానికి మండపేట బొండాలు

సీతారాముల కల్యాణానికి తూర్పుగోదావరి జిల్లా మండపేటకు చెందిన కాజులూరి వెంకట అచ్యుత రామిరెడ్డి సమకూర్చిన కొబ్బరి బొండాలను సేవా సంఘం ప్రతినిధులు బుధవారం అర్చకులకు సమర్పించారు. తూర్పుగోదావరి జిల్లా మండపేట నుంచి శ్రేష్టమైన బొండాలను సేకరించి వాటికి వాటర్ పెయింట్‌తో తిరునామాలు, శంఖు చక్రాలు, సీతారాముల పేర్లతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి రామతీర్థం చేరుకున్న పవిత్ర గోటి తలంబ్రాలను భక్తులు ప్రత్యేక ఊరేగింపు నడుమ స్వామికి సమర్పించారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు, సేవా సంఘం ప్రతినిధులు గోవింద, విజయ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెయిట్ లిఫ్టింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి



పల్లవిని అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, తదితరులు

విజయనగరం టౌన్: స్థానిక తోటపాలెంలో ఉన్న సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న సేనాపతి పల్లవి ఖేలో ఇండియా జూనియర్ ఉమెన్స్ నేషనల్ ర్యాంకింగ్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ 2023లో 64 కిలోల విభాగంలో బంగారు పతకం, సీనియర్ విభాగంలో రజతపతకం సాధించింది. ఈ మేరకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాల ఆవరణలో పల్లవిని పుష్పగుచ్ఛంతో అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పల్లవి అంతర్జాతీయ స్థాయిలో రాణించి మనదేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి.సాయి దేవమణి, ఎన్‌సీసీ అధికారిణి కెప్టెన్ ఎం.సత్యవేణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభ్యంతరాలను తెలియజేయాలి

పార్వతీపురం: ఏపీ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయసంస్థ ద్వారా సరఫరా చేయనున్న మూడు చక్రాల మోటార్ వాహనం కోసం అభ్యర్థులను జిల్లా కమిటీ ఎంపిక చేసింది. ఎంపిక చేసిన జాబితాను జిల్లా వెబ్‌సైట్ పార్వతీపురం మన్యం.ఏపీ.జీఓవీ.ఇన్ నందు పొందుపరిచామని, ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఏప్రిల్ 1వ తేదీ సాయంత్రం 5గంటల లోగా స్పందన విభాగంలో తెలియజేయాలని ఆశాఖ సహాయ సంచాలకుడు ఎం.కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయాలపాలైన ఈశ్వరరావు, నారాయణ


జామి: మండలంలో తానవరం జంక్షన్ వద్ద రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు వ్యక్తులు తీవ్రగాయాపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. తానవరం గ్రామానికి చెందిన టి.నారాయణ బుధవారం రాత్రి జామి నుంచి తానవరం బైక్ పై వెళ్తున్న సమయంలో గంధవరం గ్రామానికి చెందిన జుత్తక పైడిరాజు ఎస్.కోట నుంచి గంధవరం వెళ్తుండగా తానవరం జంక్షన్ వద్ద రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరూ తీవ్ర గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

భాగ్యలక్ష్మి మృతిపై కేసు నమోదు

పాలకొండ రూరల్: స్థానిక గేదెలవారి వీధిలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో తీవ్రంగా గాయపడిన బరాటం భాగ్యలక్ష్మి(72) మృతిచెందిన విషయం విధితమే. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై బి.శివప్రసాద్ నేతృత్వంలో మృతదేహానికి స్థానిక ఏరియా ఆసుపత్రిలో బుధవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

అభాగ్యులపై 'వాత్సల్యం'

- ఆర్థికంగా చేయూత
- ఏప్రిల్ 15 లోగా దరఖాస్తు చేసుకోవాలి



మిషన్ వాత్సల్య లోగో

విజయనగరం ఫోర్ట్: విధి వంచితులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఈ మేరకు ఎటువంటి ఆదరణ లేక అభాగ్యులుగా మిగిలిన పిల్లలకు చేయూత నిచ్చేందుకు చర్యలు చేపడుతోంది. వారి విద్య, వైద్య అవసరాలను తీర్చేందుకు ఆర్థిక చేయూత అందించనుంది. ఈ నేపథ్యంలో 'మిషన్ వాత్సల్య' పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పాన్సర్ షిప్ కల్పిస్తున్నాయి. నిరాదరణ, పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ పథకాన్ని చేపట్టారు. జిల్లాలో ఉన్న అనాథలు, అభాగ్యులు, తల్లిదండ్రులు కోల్పోయిన వారు, తల్లిదండ్రులు దూరమైన వారు పాక్షిక అనాథలు (తల్లి లేక తండ్రిని కోల్పోయినవారు), విడాకులు పొందిన తల్లిదండ్రులు ఉన్నవారు, కుటుంబం వదిలేసిన, తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధి బారిన పడినా, పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయిన, బాలల న్యాయ ఆదరణ, సంరక్షణ చట్టం–2015 ప్రకారం ఇల్లులేని పిల్లలకు ప్రకృతి వైపరీత్యానికి గురైన బాల కార్మికులు, అక్రమ రవాణా, దాడులకు గురైన బాలలు, బాల యాచకులు, బాల్య వివాహ, హెచ్‌ఐవీ బాధిత, పీడిత బాలలు, దివ్యాంగులకు మిషన్ వాత్సల్య పథకం ద్వారా వారి అభివృద్ధికి ఒక్కొక్కరికి నెలకు రూ.4 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించనున్నారు.

దరఖాస్తుకు జతచేయవలసిన పత్రాలు:
- బాలుడి/బాలిక జననధ్రువీకరణ పత్రం
- అధార్ కార్డు
- తల్లి అధార్ కార్డు
- తండ్రి అధార్ కార్డు
- తల్లి, తండ్రి డెత్ సర్టిఫికెట్, మరణకారణం
- గార్డియన్ అధార్
- రేషన్ కార్డు
- కుల ధ్రువీకరణ పత్రం
- బాలుడు, బాలిక పాస్‌పోర్టు సైజు ఫొటో
- స్టడీ సర్టిఫికెట్
- ఆదాయ ధ్రువీకరణ పత్రం
- బ్యాంకు అకౌంట్ వివరాలు బాలుడు, లేదా బాలిక వ్యక్తిగత అకౌంట్ లేక తల్లి తండ్రి సంరక్షకులతో కలిసిన జాయింట్ అకౌంట్

వార్షికాదాయం పరిమితి

గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ సంవత్సర ఆదాయం రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలు మించరాదు. జేజే బోర్డు, బాలల సంక్షేమ కమిటీ కోర్టు లిఖిత పూర్వకంగా నమోదు చేసిన కారణాల అధారంగా అవసరాన్ని బట్టి స్పాన్సర్ షిప్ పొడిగించవచ్చు. స్పాన్సర్ షిప్ అందుకుంటున్న బాలలను ఏదైనా వసతి గృహం, బాల సదనంలో చేర్పించిన తర్వాత సహాయం నిలిపివేస్తారు. ప్రత్యేక అవసరాలు కలిగిన బాలల విషయంలో మినహా పాఠశాలలకు వెళ్లే వారు పాఠశాల హాజరు 30 రోజులకు పైగా సక్రమంగా లేదని తేలినా పరిశీలించి తాత్కాలికంగా నిలిపివేస్తారు.

దరఖాస్తు పరిశీలన

సీడీపీఓ కార్యాలయాన్ని అందిన దరఖాస్తులన్నింటినీ మండల స్థాయి స్క్రూటినీ కమిటీ (ఎంఆర్‌ఓ, ఎంపీడీఓ, ఎంఈఓ, సీడీపీఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్) మీటింగ్‌లో దరఖాస్తులను నిశితంగా పరిశీలించి అర్హత కలిగి ఎంపిక చేసిన ప్రతి దరఖాస్తుపై కమిటీ సభ్యులందరూ సంతకం చేసిన తరువాత సదరు మీటింగ్ మినిట్స్ తో పాటు దరఖాస్తులన్నిటిని జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయానికి సమర్పిస్తారు.

సీడీపీఓలకు ఆదేశాలు

మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి దరఖాస్తులు తీసుకోవాలని సీడీపీఓలకు ఆదేశాలు జారీ చేశాం. వారి నుంచి వచ్చిన దరఖాస్తులను ఉన్నతాధికారులకు పంపిస్తాం.

బి. శాంతకుమారి, జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి

పశుపోషణతో ఆర్థిక ప్రగతి



రైతు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తిరుపతిపశువైద్య కళాశాల విభాగాధిపతి వెంకటనాయుడు



సదస్సులో పాల్గొన్న వివిధ విభాగాల సిబ్బంది, రైతులు

చీపురుపల్లిరూరల్(గరివిడి):

పశుపోషణతో ఆర్థికాభివృద్ధి సాధ్యమని తిరుపతి పశువైద్య కళాశాల విభాగాధిపతి జి.వెంకటనాయుడు అన్నారు. గరివిడి వెంకటేశ్వర పశువైద్య కళాశాలలో అసోసియేట్ డీన్ మక్కేన శ్రీను ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రైతు సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతీ రైతుకు పశుపోషణ, పశుయాజమాన్యం, పశుఆరోగ్యం, పశువృద్ధిపై స్పష్టమైన అవగాహన అవసరమన్నారు. అధిక పాలదిగుబడికి అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. పశుసంవర్ధక శాఖ జేడీ వై.వి.రమణ మాట్లాడుతూ వ్యవసాయం, పాడి పరిశ్రమతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. జిల్లాలో సుమారు 5 వందల రైతుభరోసా కేంద్రాలు రైతులకు సేవలందిస్తున్నాయని తెలిపారు. పశుగ్రాసం విత్తనాలు (75 శాతం), మిశ్రమ దాణా (60 శాతం), చాఫ్‌కటర్స్‌ను రాయితీపై అందిస్తున్నామన్నారు. దేశీయగోజాతులను పరిరక్షణకు వైఎస్సార్ దేశీయ గోజాతి పథకాన్ని అమలు చేస్తున్నట్టు వెల్లడించారు. మనుషుల కోసం 104, 108 వాహనాల మాదిరిగానే పశువులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 1962 సంచార పశువైద్య వాహనాలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. సదస్సులో నాబార్డు డీడీఎం నాగార్జున, వెటర్నరీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, కళాశాల శాస్త్రవేత్తలు, వివిధ విభాగాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పూర్తయిన ఇంటర్‌మీడియట్ పరీక్షలు

- మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడి నలుగురు డీబార్

విజయనగరం పూల్‌బాగ్: ఇంటర్‌మీడియట్ ద్వితీయ సంవత్సరం(కెమిస్ట్రీ-2,కామర్స్-2,సోషియాలజీ-2,ఫైన్ ఆర్ట్స్ మ్యూజిక్ పేపర్-2) పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 21,517 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్‌మీడియట్ జనరల్ పరీక్షకు 20938 మంది హాజరు కావాల్సి ఉండగా, 20122 మంది, ఒకేషనల్ పరీక్షకు 1522 మందికి గాను, 1395మంది హాజరయ్యారు. మొత్తం రెండు పరీక్షలకు కలిసి 943 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆర్‌ఐఓ నాలుగు పరీక్షా కేంద్రాలను, డీఈసీ మూడు కేంద్రాలను తనిఖీ చేశారు. స్క్వాడ్ బృందాలు 42, ఇతర అధికారులు 8 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. మాల్ ప్రాక్టీసుకు పాల్పడిన నలుగురు విద్యార్థులపై కేసులు నమోదు చేసినట్లు ఆర్‌ఐఓ ఎం సత్యనారాయణ తెలిపారు.

జాతీయ మాస్టర్స్ అథ్లెట్‌కు ఎస్పీ ప్రశంసలు



నాయుడును అభినందిస్తున్న ఎస్పి ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని మిడ్నాపూర్, కోల్‌కత్తాలో ఫిబ్రవరి 10 నుంచి 18 వరకు జరిగిన 42, 43వ జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ -2022, 2023 క్రీడా పోటీల్లో విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో హెచ్‌సీగా పనిచేస్తున్న వి.కృష్ణంనాయుడు విశేషప్రతిభ కనబర్చి నాలుగు బంగారు, రెండు రజత, ఒక కాంస్య పతకం సాధించారు. ఈ మేరకు బుధవారం ఎస్పీ ఎం.దీపికను ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె నాయుడును అభినందించి, క్రీడాప్రతిభను ప్రశంసించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ క్రీడల పట్ల ఎంతో ఆసక్తితో సాధనచేసి జాతీయస్థాయిలో పతకాలు సాధించడం చాలా గొప్ప విషయమని, ఆయన క్రీడా స్ఫూర్తి యువతకు ఆదర్శమని ప్రశంసించారు. అనంతరం విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, రూరల్ సీఐ టీవీ.తిరుపతిరావు, ఎస్సై గణేష్‌లు నాయుడును అభినందించారు.

8 తులాల వెండి వస్తువుల చోరీ



చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

భోగాపురం: మండల కేంద్రం భోగాపురంలో మంగళవారం అర్ధరాత్రి 8 తులాల వెండి చోరీ జరిగింది. ఈ ఘటనపై ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రామిశెట్టి సాయిలక్ష్మికి ఇద్దరు కుమారులు అనంతకృష్ణ, ఉమామహేశ్వరరావు ఉన్నారు. ఉద్యోగరీత్యా పెద్ద కుమారుడు డెంకాడ మండలం మహంతిపేట, చిన్న కుమారుడు విశాఖపట్నం జిల్లా పరవాడలో నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం సాయిలక్ష్మి ఇంటికి తాళం వేసుకుని పెద్దకుమారుడి కుమార్తెను చూసేందుకు వెళ్లింది. ఇదే అదునుగా గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి చొరబడ్డారు. సెల్ఫ్‌లో ఉన్న తాళాలతో బీరువాను తెరిచి అందులో 8 తులాల వెండి వస్తువులను అపహరించుకుని పారిపోయారు. బుధవారం ఉదయం సాయిలక్ష్మి ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి బీరువాలో సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో బీరువాలో వెండి వస్తువులు లేకపోయేసరికి భోరుమంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సైలు కృష్ణమూర్తి, మరళీకృష్ణ(క్లూస్ టీం) సిబ్బందితో చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి, పలు ఆధారాలు సేకరించారు.

విద్యుత్ షాక్‌తో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి



విద్యుత్ షాక్‌తో మరణించిన కాంట్రాక్ట్ కార్మికుడు కర్రి అప్పలనాయుడు



రాజాం సిటీ: సన్యాసిరావు మృతదేహం

డెంకాడ: మండలంలోని బెల్లాం గ్రామంలో విద్యుత్ షాక్‌తో కాంట్రాక్ట్ కార్మికుడు కర్రి అప్పలనాయుడు(36) మృతి చెందినట్టు ఎస్సై మహేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన అందజేసిన వివరాలిలా ఉన్నాయి. విద్యుత్ లైన్ ఆన్‌లో ఉందో? లేదో? నిర్ధారించుకోకుండా కాంట్రాక్టర్ దగ్గరుండి కార్మికుడు అప్పలనాయుడిని స్తంభం ఎక్కించాడు. ఈ క్రమంలో అప్పలనాయుడు విద్యుత్ లైన్ పట్టుకోగానే షాక్ కొట్టి అక్కడికక్కడే మరణించాడు. మృతుడు అప్పలనాయుడు పూసపాటిరేగ మండలంలోని తొత్తడాం గ్రామానికి చెందిన వ్యక్తి. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

భోగాపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన విశాఖపట్నానికి చెందిన షేక్ గొసియా(27) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందింది. ఈ మేరకు ఎస్సై కృష్ణమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నానికి చెందిన షేక్ గొసియా ప్రతి రోజూ రైతుల దగ్గర పువ్వులు కొనుగోలు చేసి విశాఖపట్నం తీసుకుని వెళ్లి అమ్ముతుంది. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం విశాఖపట్నం నుంచి భోగాపురం వచ్చి రెడ్డి హోటల్ సమీపంలోని జాతీయ రహదారిపై దిగి రోడ్డు దాటుతుండగా శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్తున్న పల్సర్ బైక్ బలంగా ఢీకొట్టింది. దీంతో షేక్ గొసియా తలకు గాయమై తీవ్ర రక్తస్రావమైంది. బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్సై కృష్ణమూర్తి సంఘటన స్థలానికి వచ్చి క్షతగాత్రులను విజయనగరం ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. షేక్ గొసియా పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు అక్కడి నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు తీసుకువెళ్లగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.

బస్సు ఎక్కుతూ జారిపడి వ్యక్తి..

రాజాం సిటీ: ఎక్కాల్సిన బస్సు కాకుండా వేరే బస్సు ఎక్కుతూ జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. రాజాం బస్టాండ్‌లో బుధవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనపై స్థానికులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెర్లాం మండలం లోచర్ల గ్రామానికి చెందిన విశ్రాంత విద్యుత్ ఉద్యోగి వెలమల సన్యాసిరావు (64), గ్రామానికి చెందిన మరో వ్యక్తి జి.లక్ష్మణరావుతో కలిసి మందుల కొనుగోలుకు రాజాం వచ్చాడు. సాయంత్రం కావడంతో తిరిగి ఇంటికి వెళ్లేందుకు ఇద్దరూ బస్టాండ్‌కు చేరుకున్నారు. బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరడంతో తమ రూట్ బస్సు అనుకుని సన్యా సిరావు ఎక్కుతుండగా మన బస్సు కాదని ఆయనతో వచ్చిన లక్ష్మణరావు వారిస్తుండగా బస్సు దిగుతూ కాలుజారి పడిపోయాడు. దీంతో బస్సు చక్రాలు మీదనుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య నారాయణమ్మతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గురుకులాల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 4 వరకు గడువు

నెల్లిమర్ల: జిల్లాలోని ఎంజేపీఏపీ బీసీ గురుకుల పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియంలో ఐదో తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 4వ తేదీవరకు గడువు ఉందని ఆ గురుకులాల కన్వీనర్ కేబీబీ రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మూడు బాలికలు, నాలుగు బాలుర పాఠశాలలున్నాయని చెప్పారు. ఆయా పాఠశాలల్లో ఐదో తరగతిలో మొత్తం 440 సీట్లున్నాయని, వాటిలో 200 బాలికల కోసం, 240 బాలుర కోసం సీట్లు కేటాయించినట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు వచ్చే నెల 4వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 16వ తేదీన ప్రవేశాలకు సంబంధించిన రాత పరీక్ష ఉంటుందని కన్వీనర్ తెలిపారు. పరీక్ష రాయడానికి మూడు రోజుల ముందు నుంచి హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లాకు చెందిన విద్యార్థులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

31లోగా ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి

విజయనగరం పూల్‌బాగ్: ఇటీవల జరిగిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్) పరీక్షకు హాజరైన విద్యార్థుల సర్టిఫికెట్ల తనిఖీ నిమిత్తం విద్యార్థుల లిస్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పంపించినట్లు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆ లిస్టులో పేరు ఉన్న విద్యార్థులు ఈనెల 31లోగా కుల, ఆదాయ, 7వతరగతి మార్కుల శాతాన్ని ధ్రువీకరించిన పత్రం, దివ్యాంగ విద్యార్థులు వైకల్యం ధ్రువీకరించే పత్రం, ఆధార్‌కార్డు జిరాక్స్, హాల్‌టికెట్ జిరాక్స్‌కాపీతో జతపరిచి తన కార్యాలయానికి సంబంధిత పాఠశాల ద్వారా కచ్చితంగా సమర్పించాలని పేర్కొన్నారు. ఈ నెలాఖరు లోగా సర్టిఫికెట్ నకళ్లను అందజేయని విద్యార్థులను ఓసీ కులంగా పరిగణిస్తామన్నారు. తుది జాబితా విడుదల చేసిన తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఎటువంటి అభ్యర్థనలు స్వీకరించబోమని పేర్కొన్నారు. విద్యార్థి తల్లిదండ్రులు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గడువు తేదీకి ముందుగానే సర్టిఫికెట్లు అందజేయాలని స్పష్టం చేశారు.

దళిత ద్రోహి చంద్రబాబు

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జైహిందీకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జైహింద్‌కుమార్

గంట్యాడ: ఎస్సీల్లో ఎవరైనా పుడతారా అన్న వ్యక్తి ప్రతిపక్ష నేత చంద్రబాబును దళితులు ఎప్పటికీ నమ్మరు. దళిత ద్రోహి చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ మండిపడ్డారు. అన్నదమ్ముల్లా ఉన్న మాల, మాదిగల మధ్య వర్గీకర్ణ చిచ్చుపెట్టిన వ్యక్తి చంద్రబాబు అని ధ్వజమెత్తారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని, దళితుల అభివృద్ధికి సీఎం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నా ఎల్లో మీడియా, ప్రతిపక్ష నేత చంద్రబాబు ఓర్చుకోలేక లేనిపోని ఆరోపణలు చేస్తూ విషం చిమ్ముతున్నారన్నారు. దళితులకు మంత్రివర్గంలో సీఎం జగన్ మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నారు. హోం, విద్య, పురపాలక వంటి అత్యధిక ప్రాధాన్యం గల శాఖలను ఇచ్చి దళితుల పట్ల ఆయనకు ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని స్పష్టం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల కాలంలో 28 రాష్ట్రాల్లో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా చట్టసభల్లో దళితులకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు చైర్మన్ పదవులు

2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం దళితులు, నిమ్నజాతులు, బడుగులు, ఆదివాసీలకు ఉన్నతమైన స్థానం కల్పించిందన్నారు. రాష్ట్రంలో 50 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేశారని, గతంలో మార్కెట్ కమిటీల్లో ఎస్సీ, ఎస్టీలకు డైరెక్టర్ పదవులు మాత్రమే ఇచ్చేవారన్నారు. కానీ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం తొలిసారిగా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులు కూడా ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిందన్నారు. కాంట్రాక్టుల్లోను, ఉద్యోగ నియామకాల్లోను రిజర్వేషన్లు కల్పించిన గొప్ప వ్యక్తి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220